క్లుప్తంగా

భవానీమాతకు ఎంపీ పూజలు



అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ సురేశ్

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని చారిత్రాత్మక భవానీ మాతా మందిరాన్ని ఆదివారం ఎంపీ సురేశ్ షెట్కార్ సందర్శించి అమ్మవారిని దర్శించుకుని.. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీని కమిటీ సభ్యులు సన్మానించారు.

ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: మండలం పరిధి పీర్లతండాలోని కట్టమైసమ్మ ఆలయంలో ఆదివారం తండాకు చెందిన ఐఆర్ఎస్ అధికారి సుధాకర్ నాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం సుధాకర్‌నాయక్ ఎమ్మెల్యేను సన్మానించారు. ఎమ్మెల్యే వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భోజిరెడ్డి, ముఖ్యనాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, అంజిరెడ్డి, గుండెరావుపాటిల్, ప్రభాకర్‌రెడ్డి, పండిత్ నాయక్ ఉన్నారు.

నష్టపరిహారం వివరాల సేకరణ



నష్టపరిహారం వివరాలు సేకరిస్తున్న అధికారులు

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టు దిగువ ప్రాంతంలో వరదలకు నష్టపోయిన పంటలను పరిశీలించి, నష్టపరిహారం వివరాల జాబితాను తయారు చేస్తున్నామని ఏఈఓ భాగేశ్ పేర్కొన్నారు. డ్యాం దిగువ భాగంలో సింగూరు, పోచారం గ్రామాల్లో వరదలకు నీట మునిగిన పత్తి, వరి పంటల వివరాలు రైతుల సమక్షంలో సేకరించామని తెలిపారు. ఇప్పటివరకు మొదటి విడత జాబితాను తయారు చేశామని తెలిపారు. ఏఈఓ వెంట పలువురు రైతుల ఉన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోండి



మాట్లాడుతున్న సీపీఎం నేత నర్సింహులు

నారాయణఖేడ్: భారీ వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నర్సింహులు డిమాండ్ చేశారు. ఆదివారం నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పెట్టిన పెట్టుబడులు సైతం నష్టపోగా కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 30 వేలు, కౌలు రైతులకు రూ. 50 వేల చొప్పున పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. పార్టీ ఖేడ్ ప్రాంత కార్యదర్శి రమేశ్, నాయకులు సతీశ్, కాన్షిరాం, నర్సింలు, అరుణ్, గణపతి, అశోక్ పాల్గొన్నారు.

యువతకు రాజకీయ అవకాశం కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న బీసీ యువ నాయకులు


జహీరాబాద్ టౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతుల యువతకు రాజకీయ పార్టీలు అవకాశం కల్పించాలని బీసీ యువ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించడం హర్షణీయమన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల వరకు బీసీ యువతకు అధిక సీట్లు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ యువ నాయకులు నర్సింలు, నారాయణ, శంకర్ సాగర్, విశ్వనాథ్ యాదవ్, దుర్గయ్య, శివప్రసాద్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

చండీమాతగా అమ్మవారు

దేవీ నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకొని 7వ రోజు ఆదివారం అమ్మవారు చండీమాతగా దర్శనమిచ్చారు. ఆదివారం మండపాలు, ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు కుంకుమార్చన, నిర్వహించారు. ఆలయాల వద్ద సందడి వాతావరణం నెలకొంది.



జిన్నారం(పటాన్‌చెరు): వీరన్నగూడెం భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో..



న్యాల్‌కల్(జహీరాబాద్): పంచవటి క్షేత్రంలో



పటాన్‌చెరు టౌన్: చండీదేవీగా రేణుక ఎల్లమ్మ



నారాయణఖేడ్: అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



మునిపల్లి: ఖమ్మంపల్లిలో..



అమ్మవారిని నోట్లతో అలంకరించిన భక్తులు



జహీరాబాద్ టౌన్: అమ్మవారిని దర్శించుకున్న సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, ఉజ్వల్‌రెడ్డి

పరిషత్ పోరుకు రిజర్వేషన్లు ఖరారు

- జిల్లాలో 261 ఎంపీటీసీ స్థానాలు
- గతం కంటే తగ్గిన స్థానాలు

సంగారెడ్డి జోన్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రిజర్వేషన్ ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జెడ్పీటీసీతో పాటు ఎంపీటీసీ స్థానాల వారీగా రిజర్వేషన్లు ఖరారు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బీసీలకు 42% రిజర్వేషన్లు కేటాయించారు. వివిధ రాజకీయ పార్టీల నేతల సమక్షంలో లాటరీ పద్ధతిలో మహిళా రిజర్వేషన్లను ఎంపిక చేశారు. తమకు అనుకూలంగా రిజర్వేషన్లు రాకపోవడంతో పలువురు నేతలకు నిరాశ మిగిలింది. మరోవైపు ఎన్నికల నిర్వహణకు అధికారుల నియామకంతో పాటు శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. త్వరలో ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల కానుంది.

గతం కంటే తగ్గిన స్థానాలు

2019లో నిర్వహించిన పరిషత్ ఎన్నికల్లో కంటే ప్రస్తుతం ఎంపీటీసీ స్థానాల సంఖ్య తగ్గింది. జిల్లాలో కొత్తగా మున్సిపాలిటీలో ఏర్పడటంతో పాటు పంచాయతీలు మున్సిపాలిటీలో విలీనం కావడంతో ఎంపీటీసీల సంఖ్య తగ్గింది. గత ఎన్నికల్లో 295 ఎంపీటీసీ స్థానాలు ఉండగా ప్రస్తుతం 261 స్థానాలకు తగ్గింది.



ఝరాసంగంలోని మండల ప్రజాపరిషత్తు కార్యాలయం

ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్లు

జిల్లాలో మొత్తం ఎంపీటీసీ స్థానాలు 261

ఎస్సీ మహిళ	29
ఎస్సీ జనరల్	30
ఎస్టీ మహిళ	6
ఎస్టీ జనరల్	12
బీసీ మహిళ	58
బీసీ జనరల్	55
అన్ రిజర్వ్ మహిళ	35
అన్ రిజర్వ్ జనరల్	36

మెరుగైన వసతులు కల్పించండి

- కేంద్ర రైల్వే సహాయమంత్రి సోమన్నకు వినతిపత్రం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రైల్వే ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు సి.గోదావరి కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్నను కలిసి విజ్ఞప్తి చేశారు. బీదర్ వెళుతూ తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఈదుల నాగులపల్లి రైల్వే స్టేషన్‌లో ఆగిన సోమన్నను గోదావరి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ..రైల్వే స్టేషన్‌లలో పెరుగుతున్న రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించాలన్నారు. జహీరాబాద్ రైల్వేస్టేషన్ వరకు అవసరమైన చోట్ల రైల్వే అండర్ బ్రిడ్జీలను నిర్మించాలని కోరినట్లు తెలిపారు. జహీరాబాద్ నుంచి ముంబైకి నేరుగా రైలు సర్వీస్‌ను ప్రారంభించాలని కోరారు. ఈదులనాగులపల్లి రైల్వేస్టేషన్ నుంచి తెల్లాపూర్ వరకు రోడ్డును అభివృద్ధి చేయాలని తెలిపారు. తను వివరించిన సమస్యలపై కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్న సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దేశ్‌పాండే, రాజశేఖర్ రెడ్డి, శంషాబాద్ రాజు, తెల్లాపూర్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు రాంబాబు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్నకు వినతిపత్రం అందజేస్తున్న గోదావరి

సంక్షిప్త వార్తలు

◆ సింగూరుకు భారీ వరద

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు భారీ వరదలు రావడంతో క్రస్టుగేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు.మహారాష్ట్ర,కర్ణాటకలో కురుస్తున్న భారీవర్షాల వల్ల డ్యాంలోకి వరదలు చేరుతున్నాయి. ఆదివారం 96,604 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో అంతేనీటిని దిగువకు వదులుతున్నారు.

◆ భగత్‌సింగ్‌కు నివాళి

నారాయణఖేడ్: భగత్‌సింగ్ జయంతి ఉత్సవాలను మనూరు మండలం రాణాపూర్ గ్రామంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి దత్తురెడ్డి మాట్లాడుతూ.. భగత్ సింగ్ స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై ఉద్యమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

◆ మహాచండీ హోమం

హత్నూర(సంగారెడ్డి): దేవీ శరనవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రం హత్నూర సుందరమ్మతల్లి దేవి ఆలయం ప్రాంగణంలో ఆదివారం మహాచండీ హోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం చండీకాదేవి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సామూహిక మహాచండీ హోమాలు చేశారు.

◆ పాదయాత్రగా తరలిన భక్తులు

ఝరాసంగం(జహీరాబాద్): అందోల్ నియోజకవర్గంలోని రాయికోడ్ మండలంలో కొనసాగుతున్న శ్రీముమ్మాదేవి ఆలయానికి భక్తులు పాదయాత్రగా తరలివెళ్లారు. ఆదివారం జహీరాబాద్ నుంచి 100 మంది భక్తులు భజనలు చేస్తూ బయలుదేరారు. నవరాత్రి ఉత్సవాలకు 14 సంవత్సరాలుగా పాదయాత్రగా వెళ్తున్నట్లు చెప్పారు.

◆ పాదయాత్రగా..

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని ముమ్మా దేవి ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు కొనసాగుతున్నాయి. వేడుకల్లో 7వ రోజు మహాలక్ష్మి రూపంలో అమ్మవారు దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి పట్టణం నుంచి రాయికోడ్‌కు పాదయాత్రగా విచ్చేశారు. భక్తులు తీర్థప్రసాదాలు అందజేశారు.

◆ సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

నారాయణఖేడ్: మనూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నలుగురికి సీఎం సహాయనిధి నుంచి రూ.1.80 లక్షలు మంజూరయ్యాయి. సంబంధించిన చెక్కులను ఆదివారం డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అందజేశారు.

ఎన్నికల శిక్షణ తేదీని మార్చండి

- జిల్లా పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు మాణయ్య, ప్రభులు

వట్‌పల్లి(అందోల్): సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులకు స్థానిక సంస్థల ఎన్నికల శిక్షణ తేదీని మార్చాలని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు జిల్లా పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు మాణయ్య, ప్రభులు తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. సోమవారం తెలంగాణలో మహిళలందరూ పెద్దగా జరుపుకొనే సద్దుల బతుకమ్మ పండుగ సంగారెడ్డి జిల్లాతో పాటు గ్రామాల్లో జరగనుంది. దసరా సెలవులకు గాను జిల్లాలోని మహిళా ఉపాధ్యాయులు తమ సొంత గ్రామాలకు చేరుకున్నారని అన్నారు. రేపు ఊళ్లలో జరిగే బతుకమ్మ సంబరాల్లో మహిళా ఉపాధ్యాయులు పాల్గొననున్నారని చెప్పారు. 29న స్థానిక సంస్థలకు సంబంధించిన ఎన్నికల శిక్షణను నిర్వహించనున్నట్లు అధికారులు ఉత్తర్వులిచ్చారని.. బతుకమ్మ పండుగ ఉండడం వల్ల ఈ శిక్షణకు మహిళా ఉద్యోగులు హాజరు కావడం కష్టసాధ్యమవుతుందన్నారు. మరోక రోజుకు మార్చాలని కోరారు.

నీటిసరఫరాకు అంతరాయం

నారాయణఖేడ్: మంజీరా నదిలో ఉధృతంగా వరదనీరు చేరుతోంది. దీంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మిషన్ భగీరథ ఏఈ తరుమలగౌడ్ తెలిపారు. సింగూరుకు వరదనీరు వస్తున్నందున బోరంచ, పోచారం, గూడూరు సెగ్మెంట్ ప్లాంట్లలో అధికశాతం కలుషిత నీరు వస్తుందన్నారు. అందువల్ల డబ్ల్యూటీపీలను నిలిపివేశామని చెప్పారు. మిషన్ భగీరథ నీటి సరఫరా రెండు రోజుల పాటు అంతరాయం ఏర్పడుతున్నందున ప్రజలు లోకల్ వాటర్ సోర్సును ఉపయోగించుకోవాలని సూచించారు.

అందుబాటులో యూరియా

మునిపల్లి(అందోల్): 35 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి అంజలి తెలిపారు. ఆదివారం మండలంలోని తాటిపల్లి, బుదేరాకు 30 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని తెలిపారు. అవసరం ఉన్న రైతులు తీసుకోవాలని చెప్పారు. రబీ సీజన్‌లో రైతులు యూరియా కోసం ఇబ్బంది పడకుండా ముందుగా నిల్వ ఉంచినట్లు వివరించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సద్దుల బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని సండే మార్కెట్‌లో నిర్వహించే సద్దుల బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను ఆదివారం కార్పొరేటర్ పుష్ప జీహెచ్ఎంసీ అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం బతుకమ్మ ఘాట్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రామచంద్రాపురం పట్టణంలో సోమవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్తమ బతుకమ్మను ఎంపిక చేసి నగదు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. బతుకమ్మ ఘాట్ కోనేరులో నీటిని నింపుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు చిగురు శ్రీను, నాగరాజుగౌడ్, కిరణ్, సంపత్, హహిపాల్, శ్రీశైలం, స్వామిగౌడ్ పాల్గొన్నారు.



బతుకమ్మ ఘాట్ వద్ద పనులను పరిశీలిస్తున్న పుష్ప

నిరుపయోగంగా పబ్లిక్ టాయిలెట్స్

- ప్రజలకు తీరని ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

సంగారెడ్డి క్రైమ్: ప్రజల సౌకర్యార్థం సంగారెడ్డి పట్టణంలో నిర్మించిన టాయిలెట్స్ కొన్ని నిరుపయోగంగా మారాయి. మరికొన్ని ప్రైవేట్ వ్యాపారులకు సొంతం అయ్యాయి. నాలుగేళ్ల క్రితం పలు ప్రాంతాల్లో 10 టాయిలెట్స్‌ను ఒక్కొక్కదానికి రూ.15 లక్షలు వెచ్చించి పట్టణ ప్రగతి నిధులతో నిర్మించారు. టాయిలెట్స్ ప్రజల అవసరానికి రాకుండానే మూతపడ్డాయి. అప్పట్లో ఎక్కడెక్కడా అవసరం ఉన్నాయో ముందస్తు ప్రణాళికలు చేయకుండా ఏర్పాటు చేయడంతో కొన్ని చోట్ల వినియోగిస్తున్నప్పటికీ, మరికొన్ని చోట్ల మూసేశారు. కొన్ని చోట్ల ప్రైవేట్ వ్యక్తులు వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. దీంతో ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయి. ప్రజలు తమకు ఉపయోగపడటం లేదని వాపోతున్నారు. పట్టణంలోని పోతిరెడ్డిపల్లి కూడలి వద్ద మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవటంతో అత్యవసరానికి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. మహిళల పరిస్థితి మరీ దారుణంగా మారింది. పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద టాయిలెట్స్ లేక ఇబ్బందులు పడుతుంటే .. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ప్రైవేట్ వ్యక్తులు వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా పట్టణంలో టాయిలెట్స్ ప్రజలకు ఉపయోగపడేలా నిర్మించాలని ఉన్నతాధికారులను ప్రజలు కోరుతున్నారు.



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద పబ్లిక్ టాయిలెట్

బురదరోడ్లతో అవస్థలు

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని రైతువేదికకు వెళ్లేదారి చినుకుపడితే చిత్తడిగా మారుతోంది. దీంతో నిత్యం కార్యాలయానికి వచ్చే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం వరకు సీసీ రోడ్డు ఉన్నా అక్కడి నుంచి 150 మీటర్ల దూరంలో ఉన్న రైతువేదికకు వెళ్లాలంటే బురదను దాటుకుని వెళ్లాల్సిందే. వివిధ పనులపై రైతువేదికకు వచ్చే రైతులు అధ్వాన రోడ్డుతో అవస్థలు తప్పడం లేదు. రాళ్లు, బురదతో కూడిన దారిపై ద్విచక్రవాహనాలు అదుపు తప్పి జారిపడి ప్రమాదాల బారిన పడుతున్నారు. స్థానిక నాయకులు, అధికారులు స్పందించి రైతువేదిక వరకు సీసీరోడ్డు నిర్మించాలని రైతులు కోరుతున్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్లేదారి సైతం బురదమయంగా మారిందన్నారు. విద్యార్థుల బురదను దాటుకుని పాఠశాలకు హాజరవుతున్నారు. పాఠశాల ప్రధాన ద్వారం ఎదుట వర్షపు నీరు నిలిచి దోమల బెడద ఎక్కువవుతోంది. కనీసం మొరం వేసి విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



బురదమయంగా ఉన్న రైతువేదికకు వెళ్లేదారి



పాఠశాల ప్రవేశం వద్ద నిలిచిన మురుగునీరు

పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమూల్యం



కార్మికులకు చీరలు పంపిణీ చేసిన రాజ్‌కుమార్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మన పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేయడంలో పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు అమూల్యమైనవి ఆర్‌కే ఫౌండేషన్ చైర్మన్ రాజ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆర్‌కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్, పారిశుద్ధ్య కార్మికులకు నూతన దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దసరా పండుగను అందరు కలసి సంతోషంగా జరుపుకోవాలన్న ఉద్దేశంతో 200మంది కార్మికులకు గద్వాల చీరలు, పురుషులకు దుస్తులు, నగదు అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కొమరయ్య, పాండు, సాయి తదితరులు పాల్గొన్నారు.

వెంకట్ దీప్‌కు అభినందనలు

పటాన్‌చెరు: గ్రూప్–1 పరీక్షల్లో 141వ ర్యాంక్ సాధించి సివిల్ డీఎస్పీగా నియామకపత్రం అందుకున్న వెంకట్ దీప్‌ను ఆదివారం జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధారాణి కలిసి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు సుధా మాట్లాడుతూ.. మన ప్రాంతం నుంచి ప్రతిభావంతులైన యువకులు గ్రూప్–1 వంటి అత్యున్నత పోటీ పరీక్షల్లో విజయం సాధించడం గర్వకారణమని వెంకట్ దీప్ విజయంతో యువతలో మరింత స్ఫూర్తి, ఉత్తేజం కలుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.



వెంకట్‌దీప్‌తో కాటా సుధారాణి

భారీ వర్షాలు .. అపారనష్టం



రంజోల్ గ్రామంలో దెబ్బతిన్న సోయాబీన్



దెబ్బతిన్న సోయాబీన్ పంట



జాడీమల్కాపూర్‌లో నేలవాలిన చెరకు పంట

జహీరాబాద్: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నియోజకవర్గంలో వానాకాలం పంటలకు అపార నష్టం వాటిల్లింది. జహీరాబాద్, మొగుడంపల్లి, కోహీర్, ఝరాసంగం, న్యాలాకల్ మండలాల్లో మినుము, సోయాబీన్, పెసర, కంది, మొక్కజొన్న, పత్తి, చెరకు, అల్లం, బొప్పాయి, అరటి, కూరగాయల పంటలు పెద్ద మొత్తంలో దెబ్బతిన్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పెట్టిన పెట్టుబడులు సైతం చేతికి వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. దాదాపుగా అన్ని పంటలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వపరంగా ఎలాంటి సహాయం అందించడం లేదన్నారు. కౌలు రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. కౌలు డబ్బులు, పెట్టుబడుల కోసం చేసిన అప్పులు తీర్చే దారిలేకుండా పోయిందని కన్నీటి పర్యంతం అవుతున్నారు.